క్లుప్తంగా

పరామర్శ



జనగామ/బచ్చన్నపేట : ఎర్రవెల్లి ఫాం హౌజ్‌లో ఇటీవల జారి పడి స్వల్పంగా గాయపడ్డ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్లు మారబోయిన పాండు, జూకంటి లక్ష్మీశ్రీశైలం, ఎండీ సమద్, పేర్ని స్వరూప, పాక రమ, ఉడుగుల శ్రీలత బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. అంతకు ముందు ఎమ్మెల్యే త్వరగా కోలుకుని ప్రజా క్షేత్రంలోకి రావాలని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బచ్చన్నపేట మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు పల్లాను పరామర్శించారు. గోపాల్, గర్నెపల్లి వేణు, చిర్ర నవీన్‌రెడ్డి, శేరి యాదగిరి ఉన్నారు.

రాజారపు ప్రతాప్ మరణం బాధాకరం

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ధర్మసాగర్ మండలం కరుణాపురానికి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాజారపు ప్రతాప్ మరణ వార్త ఎంతో బాధాకరమైందని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను స్వల్పంగా గాయపడి, హాస్పిటల్‌లో ఉండటం వల్ల ఈ బాధాకరమైన వార్త ఆలస్యంగా తెలిసిందని చెప్పారు.

సన్మానం



జనగామ: యాసంగి సీజన్‌లో వ్యవసాయ మార్కెట్ కాటన్ యార్డులో చీటకోడూరు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుకు సహకారం అందించిన ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, డీఆర్డీఓ పీడీ వసంత, డీటీ శ్రీనివాస్, ఏపీఎం కవిత, సీసీ శ్రీనివాస్‌లను ధాన్యం కొనుగోలు నిర్వాహకులు బుధవారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సరుకుల అందజేత

నర్మెట: మండల కేంద్రానికి చెందిన ప్రజ్ఞాపురం సాయమ్మ(96) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. కాగా, డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి గంగం ట్రస్టు ద్వారా సమకూర్చిన బియ్యం, సరుకులను పార్టీ టౌన్ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్ బుధవారం అందజేశారు. పరామర్శించిన వారిలో అంజయ్య, కనకయ్య, శ్రీను, నర్సింహులు (గ్రోమోర్), యాదగిరి, సంపత్, కరుణాకర్, నరహరి, భాస్కర్, మల్లయ్య, నాయకులు ఉన్నారు.

పారా తైక్వాండో ఏషియన్ పోటీలకు కృష్ణవేణి ఎంపిక



స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు మలేషియాలో నిర్వహించనున్న పారా తైక్వాండో ఏషియన్ పోటీలకు తానేదార్‌పల్లికి చెందిన మాచర్ల కృష్ణవేణి ఎంపికైనట్లు ఇండియన్ తైక్వాండో సెక్రటరీ జనరల్ అమిత్ ధమాల్, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మలేషియా వెళ్లి పోటీలలో పాల్గొనేందుకు రూ.1.50లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు ఎవరైనా ఉంటే ఆర్థిక సహాయం చేయాలని ఆమె కోరుతున్నారు.

‘స్థానికం’లో బీఆర్‌ఎస్ వైభవం చాటాలి

దేవరుప్పుల: స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టి బీఆర్‌ఎస్ వైభవం చాటాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కోలుకొండలో ఎంపీటీసీ క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి తప్ప కాంగ్రెస్ హయాంలో శూన్యమన్నారు. సోమయ్య, ప్రవీణ్, మోహన్, మల్లేశం, గాంధీ నాయక్, గ్రామ ఇన్‌చార్జ్ గొడుగు మల్లికార్జున్, కత్తుల విజయ్ కుమార్, ఖాసీమ్ పాల్గొన్నారు.

రహదారిని కమ్మేస్తున్న చెట్లు

- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు



నర్మెట-హన్మంతాపురం దారిలో వాహనాల తాకిడికి విరిగిన చెట్ల కొమ్మలు

నర్మెట: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా హరిత హారంలో భాగంగా ప్రభుత్వం రోడ్లకు ఇరువైపులా (అవెన్యూ ప్లాంటేషన్) మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. దీంతో నాటిన మొక్కలు వృక్షాలై రహదారులను కమ్మేసి వాహనచోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ద్విచక్రవాహనాలు, కార్లు మొదలు బస్సులు, లారీలు, ట్యాంకర్లు, ఇసుక లారీలతో నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే జనగామ- హుస్నాబాద్ రహదారిలో పలుచోట్ల చెట్ల కొమ్మలు రోడ్డును కప్పేశాయి. దీంతో చీకటి పడిందంటే చాలు వాహనచోదకుల వెన్నులో వణుకుపుడుతోంది. హన్మంతాపురం-నర్మెట దారిలో మూల మలుపులకు తోడు చెట్ల కొమ్మలు రోడ్డును కప్పేయగా భారీ వాహనాల తాకిడికి అవి విరిగిపోయాయి. ఎదురెదురుగా వాహనాల వచ్చినపుడు వాహనాల లైట్ల వెలుతురుకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు పట్టదా..



వాహనాలకు చలాన్లు వేసే అధికారులు, ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు భద్రతా వారోత్సవాలు అంటారు గాని రోడ్లను కప్పేస్తున్న చెట్లు కనిపించడం లేదా.. చెట్ల కొమ్మలను తొలగించడం ప్రమాదాల నివారణకాదా.. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కొమ్మలను తొలగించాలి.

– గడమల్ల జోసెఫ్, గుంటూరుపల్లి

రెగ్యులర్ వైద్యులను నియమించాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా



వివరాలు తెలుసుకుంటున్న ఎండీ షబానా

జఫర్‌గఢ్: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర వైద్యులను నియమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత మహిళా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలపై బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పర్మనెంట్ వైద్యులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది డిప్యూటేషన్లపై పని చేస్తుండడంతో రోగులకు వైద్యసేవలు అందుబాటులో లేకుండా పోతుందన్నారు. తక్షణమే వైద్యులు, సిబ్బందిని నియమించాలని, లేదంటే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాల్లు ఆర్.లక్ష్మి, భారతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి

కొడకండ్ల: నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి కోరారు. బుధవారం నీలిబండ తండాలో నిర్వహించిన దర్తీ అబ భాగీదారి అభియాన్ పథకంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి కేంద్ర ప్రభుత్వ పథకాల్లో ప్రయోజనం పొందని వారు దరఖాస్తు చేసుకుని ప్రయోజనం పొందాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఆర్‌ఐ సుమన్, ఏపీఓ కుమారస్వామి, ఎఈఓ ప్రియాంక, కార్యదర్శి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్స్ రవివర్మ, రామకృష్ణ, నరేష్, ఆఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

- నమిలిగొండ ఎస్సీ కుల పెద్దలు



మాట్లాడుతున్న ఎస్సీ కుల పెద్దలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నామని నమిలిగొండ గ్రామానికి చెందిన జింక కొమురయ్య, రాజమ్మ దంపతులు మాపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తమని గ్రామానికి చెందిన ఎస్సీ కుల పెద్దలు గాదె కుమార్, గాదె రాములు, గాదె శ్రీధర్, జింక బాబు, గాదె మోష, జింక భిక్షపతి అన్నారు. నమిలిగొండలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 364/ఏలో సదరు భూమిని జింక కొమురయ్య చిన్నాన్న మంకయ్య మూడు గుంటలు, కొమురయ్య అన్న జింక వెంకటనర్సు రెండు గుంటల భూమిని 1997, మే 10న గ్రామ ఎస్సీ సంఘానికి విక్రయించారని తెలిపారు. సదరు స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలనుకున్నామని, అయితే కొమురయ్య ఉద్దేశ్యపూర్వకంగా ఆ స్థలంలో గుడిసె వేసుకుని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని, పోలీసులు సైతం వారికి నచ్చచెప్పినా వినకుండా మాపై అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. జింక బాబు, జింక దిలీప్, గాదె రవి, రమేష్, జోగు వెంకటయ్య, జోగు శ్రీను, రాంచందర్, లద్దూనూరి ఎల్లమ్మ, గాదె రాజమ్మ, రడపాక యాదలక్ష్మీ, మేడ యాదమ్మ, గాదె అనీత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



సన్మానం పొందిన విద్యార్థులతో ఆనందం

చిల్పూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని పాఠశాల అభివృద్ధి కమిటీ మెంబర్ జీడీ ఆనందం అన్నారు. పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు ఇటీవల ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షలో ఎంపికయ్యారు. కాగా, హెచ్‌ఎం అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ఆనందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్రనాగరాజు, బాసెట్టి జయప్రకాష్, ఉపాధ్యాయులు కోమళి, శ్యాంసుందర్‌రావు, సౌభాగ్యలక్ష్మి, నరసింహరావు, ప్రకాష్, సురేష్, లక్ష్మి, యాకూబ్‌పాషా, అలకానంద, శోభారాణి, రమేష్, అరుణ; దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు సరఫరా చేయండి



వినతి పత్రం అందజేస్తున్న జీఎంపీఎస్ నాయకులు

జనగామ రూరల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు సరఫరా చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మోటే దేవేందర్ అన్నారు. ఈ మేరకు జీఎంపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోటే దేవేందర్ మాట్లాడారు. మూడేళ్లుగా నట్టల నివారణ మందు పంపిణీని నిలిపివేయడం దారుణమన్నారు. పట్టణ అధ్యక్షుడు ఉలిగిల్ల చంద్రయ్య, కార్యదర్శి మోటే నరేందర్, ఉపాధ్యక్షుడు దావర భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కళాశాల జనగామలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.విక్రంకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెమిస్ట్రీ, గణితం బోధించడానికి పీజీ, బీఎడ్ పూర్తి చేసి 44 సంవత్సరాలలోపు ఉన్నవారు అర్హులతన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 5వ తేదీ 4.30 గంటలలోపు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 9951933034 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

6న ‘విరసం’ ఆవిర్భావ సభ

జనగామ: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 6న విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ కోడం కుమారస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నాగేశ్వర్, జి. కళావతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభ జరుగుతుందన్నారు. ఉదయం ×కాల్పు ల విరమణ ఒప్పందాలు–మార్క్సిస్టు దృక్పథం?, మధ్యాహ్నం ‘ఫాసిస్ట్ చుట్టు వేత దాడి–విప్లవోద్యమ పంథా’, సాయంత్రం 3 గంటలకు ‘తెలంగాణలో శాంతి చర్చల ఆవశ్యకత’ అంశాలపై ప్రసంగాలు, చర్చలు ఉంటాయన్నారు. కవులు, రచయితలు, మేధావులు, ఆసక్తిగలవారు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొనాలి

బచ్చన్నపేట: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నేడు (గురువారం) నిర్వహించే టెలికాన్ఫరెన్స్‌లో మండలంలోని బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు అందరూ పాల్గొనాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొని గ్రామాల్లో గల పార్టీ పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించాలని, ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈకార్యక్రమంలో విధిగా పాల్గొనాలని సూచించారు.

గుంత వద్ద నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

జనగామ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి అతి సమీపం హెడ్ పోస్టాఫీసు మలుపు వద్ద ప్రమాదకరంగా మారిన గుంత వద్ద బుధవారం అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కాలనీ వాసులు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ‘ఈ సమస్య అధికారులకు కనిపించడం లేదు–ప్రజలా రా మీరైనా జాగ్రత్తగా ఉండడండి’ అంటూ గుంతలో ఎర్రని జెండాతో ప్లకార్డును ఏర్పాటు చేసి హెచ్చరిస్తున్నారు. పాలక మండలి లేక, అధికారుల పర్యవేక్షణ గాలిలో దీపంలా మారడంతో రోడ్ల నిర్వహణ బాగోలేదని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్‌రాజు, బీజేపీ నాయకులు కీర్తి నర్సయ్య, శ్రీనివాస్, రాజేష్, ప్రవీణ్, నరేష్, సుల్తాన్, గోవింద్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రమాదకరంగా మారిన గుంతను బాగు చేయించాలన్నారు. అధిరారులు పట్టించుకోక పోవడంతోనే ప్రజలకు ఎలాంటి అపాయం జరుగకుండా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు.

బస్సు సర్వీస్ పునరుద్ధరించాలి

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, మాధారం, సోమయ్యకుంటతండా వరకు గతంలో నడిచిన బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని ఆయా గ్రామస్తులు బుధవారం జనగామ ఆర్టీసీ డీఎం, సీఐలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయా గ్రామాల పెద్దలు పోకల శ్రీనివాస్, మేకల శంకరయ్య, గొట్టం కరుణాకర్ రెడ్డి, గ్యార నాగరాజు, మేడిపల్లి నరేష్, కొండ అశోక్, మేడిపల్లి మహేష్ ఉన్నారు.

8న వైద్య శిబిరం

కొడకండ్ల: ఈ నెల 8వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండలకేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్‌హాల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గాజుల రాములు, కార్యదర్శి పసునూరి మధుసూదన్, కోశాధికారి నేతి కొండయ్యలు తెలిపారు. మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన డాక్టర్లతో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

పాలకుర్తి టౌన్: బూత్ లెవెల్ అధికారులు ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పాలకుర్తి తహసీల్దార్, సహాయ ఓటరు నమోదు అధికారి ఎం.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ అధికారులకు ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్, శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడంలో నిర్లక్ష్యం లేకుండా పని చేయాలన్నారు. నియోజకవర్గ డ్రైయినర్లు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

పీరీల సందడి

నర్మెట: మొహర్రంను పురస్కరించుకుని గ్రామాలలో పీరీలను ఊరేగిస్తూ కుల మతాలకు అతీతంగా పిల్లాపెద్దలు సందడి చేస్తున్నారు. కాళ్లకు గజ్జెలు కట్టి అస్సోదుల్లా ..అస్సోదుల్లా అంటూ దప్పు చప్పుల్లతో వాడవాడలా ఇంటింటికి వెళ్తుండగా .. ఇంటి ముందుకు వచ్చిన పీరీలకు కానుకలు సమర్పించి తమ చిన్నారులకు మహిళలు ఊదు పొగలు వేయిస్తున్నారు. ఈ సందర్భంగా గండిరామారానికి చెందిన పీరీలు బుధవారం నర్మెటలో సందడి చేశాయి.

వేగ పరిమితి దాటితే ఆటోమేటిక్‌గా చలాన్

- స్పీడ్ గన్స్ చూస్తున్నాయి జాగ్రత్త
- జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి



రఘునాథపల్లిలో స్పీడ్‌గన్ పనితీరు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి: రోడ్లు విశాలంగా ఉన్నాయని..అతి వేగంతో ప్రయాణిస్తే జరిమానా తప్పదని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో జాతీయ రహదారిపై వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన స్పీడ్ గన్‌ల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీఐ మాట్లాడుతూ రఘునాథపల్లి, చిల్పూర్, లింగాలఘణపురం మండలాల పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు మూడు స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేశామన్నారు. వాహనాలు ఎంత వేగంగా వెళ్తున్నారనేది స్పీడ్ గన్‌లు రికార్డు చేస్తున్నాయని, ఆటోమెటిక్‌గా వాహనం నంబర్‌పై చలాన్ జనరేట్ అవుతుందన్నారు. ఏ వాహనం ఎంత వేగంతో వెళ్తుంది, నిర్ణీత స్థాయి వేగం 80 దాటి ప్రయాణిస్తే జరిమానా తప్పదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని, అలాంటి వారు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడుపాలన్నారు. ఎస్సై దూదిమెట్ల నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నర్మెట: ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు



పాలకుర్తిటౌన్: మాశుక్‌కు సాయం చేస్తున్న చిన్ననాటి స్నేహితులు

నర్మెట: హన్మంతాపురంకు చెందిన రాయారపు రాంచంద్రం (52) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా 1989 ఎస్ఎస్‌సి బ్యాచ్ మిత్రులు బుధవారం మృతుడి (మిత్రుడి) కుటుంబాన్ని పరామర్శించి రూ. 30 వేల సాయం అందజేశారు. ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి , చింతకింది సురేష్, వలబోజు రమేష్, రంగరాజు ప్రసాద్ రావు, ప్రెజ్ఞాపురం కనకయ్య, యాదయ్య, కృష్ణమూర్తి, నిమ్మ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బాల్య సేహ్నితుడికి..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిని బ్యాండ్ కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ అబ్బాస్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా, మృతుడి కుమారుడు ఎండీ మాశుక్ చిన్నానాటి బ్యాల స్నేహితులు బుధవారం బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం అందజేశారు. బాల్య స్నేహితులు సలేంద్ర సోమన్న, రామగిని నాగరాజు, పోన్నాల శోభన్‌బాబు, ముత్తోజు రాజు, ఇండ్ల సునీత, చిట్యాల మధు, ఆవిరినేని పోతన రావు, వీరమానేని గోపిరావు, కమ్మగాని కుమార్, మధు, బెల్లి యుగేందర్ ఉన్నారు.

పల్లగుట్టలో..

చిల్పూరు: పల్లగుట్ట గ్రామానికి చెందిన దార బుచ్చయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు పంపిన రూ. 5 వేల సాయం బాధిత కుటుంబ సభ్యులకు పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు అందజేశారు. గట్టేష్, ఎనగందుల నరసింహారెడ్డి, దుర్గాప్రసాద్, స్టాలిన్, అశోక్ పాల్, దార కుమార్, సంజీవ, ఇసురం శ్రీను, రమేశ్, దార శ్రీను, అశోక్‌లు ఉన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లకు పట్టాలు ఇవ్వండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజారెడ్డి

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లిలో ఎనమిది ఏళ్ల క్రితం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లలో నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీ పేదలకు పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని బాధితులు సీపీఐ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి పార్టీ నాయకులు, బాధితులతో కలెక్టర్‌ను కలిసి గతంలో డబుల్‌బెడ్రూం ఇళ్లకు అర్హులుగా గుర్తించిన పేదలు వాటిలోనే నివసిస్తున్నారని, విద్యుత్, తాగు నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కాగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి, సహాయ కార్యదర్శి కందుకూరి మల్లేష్, కంచనపల్లి గ్రామ కార్యదర్శి దానియేలు, వెంకటయ్య, సుధాకర్, దయాకర్, నర్సమ్మ, అశ్విని, వెంకటమ్మ, సావిత్రి ఉన్నారు.

టీబీ ముక్త్ భారత్‌కు కృషి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ

లింగాలఘణపురం: దేశంలో టీబీ రహిత సమాజం టీబీ ముక్త్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు కోరారు. బుధవారం చీటూరులో టీబీపై అవగాహన కార్యక్రమాన్ని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ గ్రామాన్ని సందర్శించి మాట్లాడారు. డాక్టర్ అశోక్‌కుమార్, స్థానిక వైద్యురాలు స్వర్ణలత, కమల్‌హాసన్, అనిల్, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం సుస్మిత పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మానవ అక్రమ రవాణా నివారణపై శిక్షణ

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం మానవ అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రిన్సిపాల్ సునీత విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మోడల్ స్కూల్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సుమారు 600 మంది విద్యార్థులకు మానవ అక్రమ రవాణ ఎందుకు జరుగుతుంది..? రక్షించుకోవడం ఎలా? అక్రమ రవాణా చేస్తే విధించే శిక్షలపై వివరించారు. అదే విధంగా ఫోక్సో చట్టం, ట్రాఫిక్ ప్రివెన్షన్ యాక్ట్‌పై వివరించారు.

సమ్మెను జయప్రదం చేయండి



జనగామ రూరల్: ఈనెల 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆల్ ట్రేడ్ యూనియన్ సమావేశం బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడారు. ప్రసాద్ , ప్రశాంత్, జ ప్రకాష్, ఆనందం, మల్లేష్, రాజ్ పాల్గొన్నారు

దేశ వ్యాప్త సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 9వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశం కత్తుల రాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రిఅహల్య, రమేష్, యాకయ్య, చందు, సుదర్శన్, ఐలయ్య, నరసింహులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

పాలకుర్తి: వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని పాలకుర్తి వ్యాపార వర్గాలకు హమాలీ కార్మికులు సమ్మె నోటీసును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీ యూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న మాట్లాడుతూ ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎర్రబెల్లిని కలిసిన శ్రీకాంత్‌గౌడ్

దేవరుప్పుల: జన్మదినం పురస్కరించుకుని విదేశాలకు వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును బుధవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు కలిసి ముందస్తు కేక్ చేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం పాటుపడే శ్రేణులకు తప్పక భవిష్యత్ ఉంటుందని సూచించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

దేవరుప్పుల: జనగామ–సూర్యాపేట రహదారిపై మద్యం తాగి వెళ్తున్న ఓ ఇద్దరు వాహనదారులపై కేసు నమోదు చేయగా జైలు పాలైనట్లు ఎస్సై ఊర సృజనకుమార్ తెలిపారు. ఈ నెల 29వ తేదీన సూర్యాపేట జిల్లా తిర్మలగిరి మండలం మాలిపురానికి చెందిన గంట వెంకట్‌రెడ్డి, సతీష్‌రెడ్డిలు మద్యం సేవించి మోటర్ సైకిళ్లపై వెళ్తుండగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేపట్టగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ విషయమై వారిని బుధవారం జనగామ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. వానహదారులు రోడ్డు భద్రత నియమావాళి విస్మరిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండల కేంద్రానికి చెందిన హమాలీ కార్మికుడు కడారి నరేష్ (41) హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27వ తేదీన మండల కేంద్రంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన విషయం విదితమే. రఘునాథపల్లికి చెందిన నరేష్ తీవ్ర గాయాలతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకులైన వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వైభవంగా గోరింటాకు వేడుకలు



వేడుకల్లో మహిళలు

జనగామ: ఆషాడమాసం పర్వదినం పురస్కరించుకుని జిల్లా కేంద్రం దుర్గానగర్ కాలనీలో బుధవారం కొండిన్య క్వీన్స్ మహిళా మండలి ఆధ్వర్యంలో గోరింటాకు పండుగ వేడుకను నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు ముగించిన అనంతరం మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకుని సంబురాలు జరుపుకున్నారు. వేడుకలో మహిళలు దూడల శోభారాణి, కన్నా ప్రవంతి, కుర్రముల మాధవి, గోపగోని జ్యోతి, బిక్కిమంగ, విజయ, దూసరి కవిత, బైరగోని సుజాత, మేకపోతుల హేమలత, బైరగోని నిర్మల తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

జనగామ: జనగామ మండలం వడ్లకొండ మీదుగా పట్టణంలోని గిర్నిగడ్డ గాంధీనగర్ అపార్ట్‌మెంట్స్ కాలనీ మీదుగా ప్రతి రోజూ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో రహదారులుగుంతలమయంగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, బుధవారం ఉదయం నంబర్ లేని ఓ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా కాలనీ వాసులు 100 డయల్‌కు చేశారు. వెంటనే పోలీసులు వచ్చి ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. ఈ దారి గుండా ఇసుక అక్రమ తరలింపును వెంటనే ఆపేయాలని కోరారు.